# రేవంత్.. నీ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకో!

మొదటిపేజీ తరువాయి...

రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జనగామలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్, రాకేశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఏకమొత్తంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని, రైతుల రుణం తీరుస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతులతో రణం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అక్రమ కేసులతో వేధిస్తున్నదని దుయ్యబట్టారు. చివరి రైతు వరకూ రుణమాఫీ అయ్యేదాకా రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆగస్టు 15లోగా మాఫీ చేస్తానని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై ఒట్టు వేసి, మోసం చేశారని, రేవంత్‌రెడ్డి పాపం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలకుడు పాపం చేస్తే ప్రజలకు అరిష్టమని పేర్కొన్నారు. సీఎంను క్షమించాలని, ప్రజలను ఆశీర్వదించాలని స్వామివారిని వేడుకున్నట్టు చెప్పారు. అన్ని రకాల వడ్లకు బోనస్, రైతుభరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ అయ్యేంత వరకు పోరాడేలా బీఆర్‌ఎస్‌కు శక్తిని ప్రసాదించాలని లక్ష్మీనరసింహుడిని కోరినట్టు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రమాణం చేసిన ఆలయాలు, మెదక్ చర్చి, జహంగీర్‌పీర్ దర్గా వంటి అన్ని చోట్లకూ వెళ్లి దేవుళ్లను ప్రార్థిస్తామని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రికి రుణమాఫీపై మాట్లాడే మొహం లేక మీడియాతో మాట్లాడాలంటూ మంత్రులను కాళ్లావేళ్లా పడుతున్నారని ఎద్దేవా చేశారు.

### రేవంత్ రెడ్డిని క్షమించండి.. తెలంగాణ ప్రజలను దీవించండి

'డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పింది రేవంత్ రెడ్డా? కాదా? డిసెంబర్ 7న ఎందుకు మాఫీ చేయలేదు? గద్దెనెక్కాక రుణమాఫీ మర్చిపోయిండు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల హామీలతో ప్రజలను మోసగించిండు. పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మడం లేదని చివరికి దేవుళ్ల మీద ఒట్లు పెట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరుతానని ఏ ఊరికి పోతే ఆ ఊరు దేవుడి మీద ఒట్టు పెట్టిండు.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిపై కూడా ఒట్టు పెట్టిండు. నర్సన్న తెలంగాణ కొంగుబంగారం. ఎంతో మహిమ గల దేవుడు. ఆయన మీద ఒట్టు పెట్టి మాట తప్పితే క్షమించరాని నేరం. పాలకుడే పాపం చేసి మాట తప్పడం వల్ల ప్రజలకు, రాష్ట్రానికి అరిష్టం వాటిల్లవద్దని స్వామివారిని దర్శించుకున్నాం. ఈ పాపాత్ముడిని, దుర్మార్గుడిని, దివాలాకోరు ముఖ్యమంత్రిని క్షమించండి. రేవంత్‌రెడ్డి చేస్తే శిక్ష ప్రజలకు పడవద్దని.. తెలంగాణ ప్రజలను దీవించండని స్వామివారిని వేడుకున్నాం. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని దేవుడి మీద ఒట్టు వేసి చేయకపోవడం మోసం కాదా? రైతులనే కాదు.. దేవుడిని కూడా రేవంత్‌రెడ్డి మోసం చేసిండు. దైవద్రోహానికి పాల్పడ్డారు' అని హరీశ్‌రావు విమర్శించారు.



యాదగిరిగుట్టలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

> నిజంగా రుణమాఫీ అయితే బ్యాంక్‌ల వద్ద రైతులు ఎందుకు పడిగాపులు కాస్తున్నరు? వ్యవసాయ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా ఎందుకు తిరుగుతున్నరు? సీఎం దిష్టిబొమ్మలను ఎందుకు తగలబెడుతున్నరు? రోడ్ల మీదకు వచ్చి ఎందుకు ధర్నాలు చేస్తున్నరు? రైతుభరోసా ఎందుకు ఇవ్వలేదు? ఎప్పుడు ఇస్తవ్? చిన్న సన్నకారు రైతులు అప్పులు చేసుకునే పరిస్థితి వచ్చింది. - హరీశ్‌రావు

### దేవుళ్లను మోసం చేసిన చరిత్ర రేవంత్‌ది

'రైతు రుణమాఫీ చేశాం.. నన్ను రాజీనామా చేయమంటుండు. ప్రజల పక్షాన పోరాడటమే నాకు తెలుసు. మాట మీద నిలబడటం నాకు తెలుసు. రెండుసార్లు ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేసిన చరిత్ర మాది. మోసం చేసే చరిత్ర నీది. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట తప్పిన చరిత్ర నీది. రుణమాఫీ అంటూ దేవుళ్లను కూడా మోసం చేసిన చరిత్ర నీది' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు.

### ప్రజాపాలనలో ధర్నాలు నిషేధం

'ప్రజాపాలనలో ధర్నాలు నిషేధం అంటూ పోలీసులు రైతులకు నోటీసులు ఇస్తున్నరు. బాల్కొండలో ధర్నాలో పాల్గొంటే కేసులు, చర్యలు ఉంటాయని రైతులకు నోటీసులు ఇచ్చారు. రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మీడియా ప్రతినిధులపై సీఎం అనుచరులు దాడులు చేశారు. కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడిలో నిరసన తెలపడానికి వెళ్తున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ఆదిలాబాద్‌లో పోలీస్ యాక్ట్ అమల్లోకి తీసుకొచ్చారు. అడుగడుగునా రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నరు' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఇందిరమ్మ రాజ్యమంటే అణిచివేయడమేనా?

ప్రజారాజ్యం, ఇందిరమ్మ రాజ్యమంటే అణిచివేయడమేనా? ఇందిరమ్మ రాజ్యంలో నిరసన తెలిపే హక్కు ఉండదా? రైతులు తమ బాధలను చెప్పుకొని, నిరసన తెలిపే హక్కు ఉండదా? అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఆంక్షలు పెట్టినా, చివరి రైతు వరకూ రుణమాఫీ అయ్యేదాకా ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ కొట్లాడుతూనే ఉంటదని స్పష్టంచేశారు. పోలీసులు కూడా చట్టం ప్రకారం నడుచుకోవాలని, చట్టాన్ని అతిక్రమించి ప్రభుత్వానికి కొమ్ముగాయొద్దని హితవు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతం కాదు..అన్నీ రాసిపెడుతున్నాం.. నాలుగేండ్లకు మళ్లీ మేం వస్తాం.. చట్ట ప్రకారం వ్యవహరించండి జాగ్రత్త'అంటూ పోలీసులను హెచ్చరించారు. ఆగస్టు నెల వచ్చినా ఊర్లల్లో చెరువులు నింపడం లేదని, 11 విడతల్లో రూ.72 కోట్ల రైతుబంధు, రైతుబీమా ఇచ్చి చెరువులు నింపి ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకేలా నీళ్లు నింపిన ఘనత కేసీఆర్‌ది అని స్పష్టంచేశారు.

> లాఠీలతోనో, బెదిరింపులతోనో, పోలీసులతోనో రైతుల ఆగ్రహానికి ఆనకట్ట వేయలేరు. నువ్వు చేసిన మోసం, ద్రోహాన్ని సరిచేసుకోవాలి. పోలీసులు, లాఠీలతో రైతులను అడ్డుకోవడం మూర్ఖత్వం. అన్నదాతకు అన్యాయం చేసినోడు బాగుపడినట్టు చరిత్రలో లేదు. - హరీశ్‌రావు

> రేవంత్‌రెడ్డీ.. నీకు నీతి, నిజాయతీ ఉంటే బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పు. నువ్వు ఒట్టు వేసిన దేవుళ్ల దగ్గరకు వెళ్లి ప్రాయశ్చిత్తం చేసుకో. 'దేవుడా! నేను తప్పు చేసిన.. నన్ను క్షమించు.. తొందరపడి ప్రమాణం చేసిన' అని చెప్పి ప్రాయశ్చిత్తం చేసుకో. నువ్వు చేసుకోవు గనుకనే మేం రావాల్సి వచ్చింది. పాపాత్ముడు, అబద్ధాలకోరు, దివాలాకోరు, దగాకోరు సీఎంను తెలంగాణ ప్రజల ముఖం చూసి క్షమించాలని, రాష్ట్ర ప్రజలను దీవించాలని లక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నాం. పాలకుడు పాపం చేస్తే ప్రజలకు అరిష్టం చుట్టుకుంటుందని పాప పరిహార పూజలు చేశాం. - హరీశ్‌రావు

### హరీశ్‌రావు ప్రెస్‌మీట్‌లో కరెంట్ కట్

యాదగిరిగుట్టలోని హరిత హోటల్‌లో మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతుండగా కరెంటు పోయింది. దీంతో ప్రజాప్రతినిధులతో పాటు అక్కడున్న మీడియా ప్రతినిధులు నవ్వుకున్నారు. దాంతో కొంతసేపు కరెంట్ లేకుండానే ప్రెస్‌మీట్ కొనసాగించారు. కొద్దిసేపటి తర్వాత కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

### రైతులే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తరు : గొంగిడి సునీత

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవనేని కృష్ణారావు, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నేతలు క్యామ మల్లేశ్, బూడిద భిక్షమయ్యగౌడ్, గొంగిడి మహేందర్‌రెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేవంత్‌రెడ్డి అంటే కుచితం, కుతంత్రం, కుటిలం, కపటం: ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

రేవంత్‌రెడ్డి అంటే కుచితం, కుతంత్రం, కటిలం, కపటమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి కపట నాటక సూత్రధారి అని మండిపడ్డారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ గీతాన్ని పాడని గొంతు ఉందంటే అది రేవంత్‌రెడ్డిదేనని విమర్శించారు. రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డికి రైతన్నలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### రైతులను దగా చేసిన కాంగ్రెస్: పల్లా

సంపూర్ణ రుణమాఫీ జరిగేదాకా, రూ.2 లక్షలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడేదాకా ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. డిసెంబర్‌లో చేయాల్సిన రుణమాఫీని ఆలస్యం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ చెల్లించలేదని, వేలాది రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిందని మండిపడ్డారు.

## ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు

రేవంత్‌రెడ్డి అందరినీ మోసం చేశారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. అన్ని రకాల పంటలకు బోనస్ వచ్చే దాకా, రైతులకు పూర్తిగా రుణమాఫీ జరిగే దాకా, రైతుభరోసా ఇచ్చే దాకా పోరాడే శక్తిని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు అందించాలని స్వామివారిని వేడుకున్నామని, ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేసి ఉంటే, రైతుల మీద వడ్డీల భారం పడేది కాదని, ఆగస్టులో మాఫీ చేయడం వల్ల ఏడు నెలల వడ్డీ భారం రైతుల మీద పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీలో జాప్యం చేసినందుకు ఏడు నెలల వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తప్పు నీది.. శిక్ష రైతులకా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## స్పీకర్, ఎమ్మెల్యేలకు ఇచ్చి.. చిరుద్యోగులకు ఇవ్వరా..?

'రూ.2 లక్షలకుపైగా ఉన్న అప్పుపై ప్రభుత్వానికి స్పష్టత లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. రూ.2 లక్షలు పైన రుణం ఉన్నవారు మిగతా డబ్బులు కట్టాకే మాఫీ చేస్తామనే నిబంధన ఎందుకు? ఈ రూల్‌తో మళ్లీ మూడు, నాలుగు రూపాయల వడ్డీతో అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఎందుకు కల్పిస్తున్నరు? అని నిలదీశారు. రేషన్‌కార్డు, ఇన్‌కం ట్యాక్స్ నిబంధనలతో చిన్న ఉద్యోగులైన ఆర్టీసీ, సింగరేణి కార్మికులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా రుణమాఫీ ఆపారని, కానీ స్పీకర్‌కు, ఎమ్మెల్యేలకు మాఫీ చేస్తున్నారని మండిపడ్డారు. చిరు ఉద్యోగులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు.

## 46% మందికే మాఫీ

'రేవంత్‌రెడ్డి రుణమాఫీ అయిపోయిందంటరు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మాఫీ పూర్తిగా కాలేని చెప్తున్నరు' అని హరీశ్‌రావు వివరించారు. రాష్ట్రంలో 46% రైతులకు మాత్రమే మాఫీ అయ్యిందని, ఇంకా 54% మందికి బాకీ ఉన్నదని చెప్పారు. మాఫీ కాలేదని మంత్రులే చెప్తున్నరు. దీనిని బట్టి ఎవరు రాజీనామా చేయాలి అని ప్రశ్నించారు.



తిరుమలగిరి చౌరస్తాలో బీఆర్‌ఎస్ ధర్నా శిబిరంపై దాడికి పాల్పడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు



సూర్యాపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

# ధర్నాపై కాంగ్రెస్ విధ్వంసకాండ

- బీఆర్‌ఎస్ ధర్నా శిబిరంపై దాడి
- పలువురు నాయకులకు గాయాలు
- తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ఘటన
- పరామర్శించేందుకు వస్తున్న మాజీ మంత్రిని అడ్డుకున్న పోలీసులు
- సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే దాడి
- మోసాలను కప్పిపుచ్చేందుకు కాంగ్రెస్ హింస
- రైతులకు న్యాయం జరిగేదాకా పోరాడుతాం : జగదీశ్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ చిల్లర రాజకీయాలు చేయదు : గాదరి కిశోర్



తిరుమలగిరిలో కాంగ్రెస్ దాడిలో గాయపడిని వారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్



కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన పెరుమాళ్ల రాజేశ్

సూర్యాపేట, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ)/తిరుమలగిరి : పదేండ్ల కింద రాజకీయ కక్షలు, హత్యలకు అడ్డాగా ఉన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో మళ్లీ గూండాయిజం.. విధ్వంసకాండ మొదలయ్యాయి. స్థానిక మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ మూకలు విధ్వంసానికి తెగబడ్డారు. రుణమాఫీపై కాంగ్రెస్ మోసానికి నిరసనగా తిరుమలగిరిలో గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా శిబిరంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారు. రాళ్లు, గుడ్లు విసిరి దాదాపు గంట పాటు వీరంగం సృష్టించారు. ఈ దాడిలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. బీఆర్‌ఎస్ నాయకులకు చెందిన కార్లు, వాహనాల అద్దాలను కాంగ్రెస్ కార్యకర్తలు ధ్వంసం చేశారు.

### రెచ్చిపోయి.. రెచ్చగొట్టి..

రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేసిన మోసంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు బీఆర్‌ఎస్ ఇచ్చిన పిలుపుమేరకు తిరుమలగిరిలో గాదరి కిశోర్ నేతృత్వంలో ధర్నా చేపట్టగా పెద్ద ఎత్తున రైతులు, పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు పోటీగా బీఆర్‌ఎస్ శిబిరం సమీపంలోనే సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టారు. నినాదాలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ప్రతిగా బీఆర్‌ఎస్ శ్రేణులు నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒక్కసారిగా వందలాది మంది కాంగ్రెస్ మూకలు కర్రలు, రాళ్లు, కోడిగుడ్లు పట్టుకొని బీఆర్‌ఎస్ శిబిరం వైపు పరుగులు తీస్తూ ఏకబిగిన దాడి చేశారు. రాళ్లు, గుడ్లు రువ్వుతూ టెంట్లు కూల్చి వేశారు. కుర్చీలు ఎత్తికొడుతూ బీఆర్‌ఎస్ నేతల కార్లు, వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో తాటిపాములకు చెందిన పెరుమాళ్ల రాజేశ్, తుంగతుర్తి మండలం బండరామారానికి చెందిన పొదిల అంజయ్య, శాలిగౌరారం మండలం వంగమర్తికి చెందిన శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. వారిని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, గాదరి కిశోర్ పరామర్శించారు. కాంగ్రెస్ మూకలు బీఆర్‌ఎస్ శిబిరంపైనే కాకుండా రోడ్డువెంట వెళ్తున్న ఇతర వాహనాలపైనా రాళ్లు రువ్వారు. ఓ బస్సుపైకి రాళ్లు రువ్వడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ముగ్గురు మహిళలు కాంగ్రెస్ శ్రేణులపై మండిపడ్డారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

### జగదీశ్‌రెడ్డి వాహనం అడ్డగింత

గాయపడిన బీఆర్‌ఎస్ నాయకులను పరామర్శించేందుకు సూర్యాపేట నుంచి తిరుమలగిరికి వస్తున్న జగదీశ్‌రెడ్డిని జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారితో మాజీ మంత్రి వాగ్వాదానికి దిగారు. గాయపడ్డవారిని పరామర్శించేందుకు వెళ్లనీయకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

### పదేండ్లలో ఇంత చిల్లర ఏనాడూ లేదు : మాజీ ఎమ్మెల్యే కిశోర్

కాంగ్రెస్‌లాగా బీఆర్‌ఎస్ చిల్లర రాజకీయం చేయదని, పదేండ్ల పాలనలో ఏనాడూ ఇంత నీచంగా ప్రవర్తించలేదని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ స్పష్టంచేశారు. రుణమాఫీపై మంత్రులకే స్పష్టత లేదని, ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారని, రైతులను మోసం చేస్తామంటే ఊరుకునేది లేదని చెప్పారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ రజాక్, బీఆర్‌ఎస్ నాయకుడు యుగేంధర్‌రావు పాల్గొన్నారు.

## దాడికి పోలీసుల మద్దతు.. బీఆర్‌ఎస్ శిబిరం కూల్చివేత

బీఆర్‌ఎస్ ధర్నా శిబిరంపై కాంగ్రెస్ మూకల దాడికి పోలీసులూ మద్దతు పలికారు. కర్రలు, రాళ్లతో కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిందిపోయి పోలీసులే స్వయంగా బీఆర్‌ఎస్ ధర్నా శిబిరం టెంట్‌ను కూల్చారు. వాస్తవానికి ముందుగా తిరుమలగిరి చౌరస్తా సమీపంలో బీఆర్‌ఎస్ శ్రేణులు టెంట్ వేసి ధర్నాకు కూర్చున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసేందుకు పోటీగా వస్తున్నారనే విషయం గమనించి వారిని వారించాల్సిన పోలీసులే దగ్గరుండి ఉసిగొలిపి తీసుకొచ్చారని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

## రెచ్చగొట్టాలని చూస్తే సహించేదిలేదు: జగదీశ్‌రెడ్డి

బీఆర్‌ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్లోనే దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌పై కాంగ్రెస్ మూకల దాడి హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుమలగిరిలోని గాదరి కిశోర్ నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శిబిరంపై కాంగ్రెస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తమ తప్పులను, మోసాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చూస్తున్నదని, హింసను ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. పోలీసులు కూడా కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నారని దీక్ష శిబిరాన్ని పోలీసులే కూలగొట్టడం ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఎన్ని దాడులు చేసినా ప్రజల కోసం అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నామని, రెచ్చగొట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. తిరుమలగిరి ఘటనపై విచారణ చేయాలని, రైతులకు న్యాయం జరిగేదాకా తమ పోరాటం ఆగదని స్పష్టంచేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ పాపం హరీశ్‌రావు పరిహారం

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రైతులందరికీ ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని దేవుళ్లందరి మీద ఒట్టు వేసి మరీ చెప్పారు. తెలంగాణలో ఒట్టంటే నమ్మకం. 'రశీదు తప్పితే మసీదే గతి' అని తెలంగాణలో నానుడి. మాట విషయంలో తేడా వస్తే చివరికి దేవుడిపై ఒట్టేయడమే గ్రామీణ ప్రాంతాల్లో పరిపాటి. పచ్చుబియ్యం పట్టుకొని ప్రమాణం చేస్తే, దాన్ని సత్యంగానే పరిగణిస్తారు. అటువంటిది దేవుళ్ల మీదే ఒట్టేసి మాట తప్పడమంటే.. చాలా పెద్ద పాపమే. గతంలో యాదగిరిగుట్టలో తడిబట్టలతో తప్పుడు ప్రమాణం చేసిన నాయకుడు త్వరలోనే రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవిని కోల్పోయిన సంగతి అందరికీ గుర్తే. ఈ నేపథ్యంలో మాట తప్పిన రేవంత్‌రెడ్డి చేసిన పాపం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శాపం కాకుండా ఉండాలని ఆయా ఆలయాలను దర్శించి పూజలు చేసేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఆలయయాత్ర చేపట్టారు. అందులో భాగంగా తొలుత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆ సందర్భంగా అక్కడ అందరితో కలిసి హరీశ్‌రావు చేసిన సంకల్పం.

కర్షకాణాం రుణబాధా నివృత్తి విషయే
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి కృత అసత్య
ప్రలాప పాప పరిహారార్థం

విశేషేన రుణ విముక్తి విషయే తస్యకృత
వాగ్దానభంగ ప్రాయశ్చిత్తార్థం
తస్య కృత దైవ ప్రమాణభంగ తీవ్ర
పాప పరిహారార్థం

సమస్త తెలంగాణ రాష్ట్ర స్థిత అమాత్యానాం, ముఖ్యమంత్రీనాం
సత్యానాం సర్వేషాం ప్రజానాం
విషయే సద్బుద్ధి ప్రసాద సిద్ధ్యర్థం

విశేషేన కర్షకాణాం రుణవిముక్తి
పర్యంతం త్వయమేవ సంకల్పిత
యుద్ధాయ శక్తి హేతవే
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి
అనుగ్రహ ప్రసాద సిద్ధ్యర్థం

ఏతస్మిన్ ముఖ్యమంత్రి కృత అసత్య
ప్రలాప ప్రజానాం బాధా
నివారణార్థం
అస్మిన్ సంకల్పిత ప్రథమ దేవాలయే
శ్రీలక్ష్మీనరసింహస్వామి ఫల సిద్ధ్యర్థం

పుణ్య దర్శనంచ అర్చనంచ అహం కరిష్యే
ప్రజానాం త్వయమేవ కరిష్యామః



యాదాద్రి నర్సన్న సన్నిధిలో పూజలు చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

### రేవంత్ ప్రమాణం చేసిన దేవుళ్లు

| తేదీ | దేవుడు/దేవత |
|---|---|
| ఏప్రిల్ 19 | భద్రాద్రి రామయ్య |
| ఏప్రిల్ 20 | మెదక్ చర్చి<br>ఏడుపాయల దుర్గమ్మ |
| ఏప్రిల్ 21 | యాదాద్రి నరసింహస్వామి |
| ఏప్రిల్ 22 | బాసర సరస్వతీదేవి |
| ఏప్రిల్ 23 | అలంపూర్ జోగులాంబ |
| ఏప్రిల్ 24 | రామప్ప శివుడు<br>హనుమకొండ వేయి స్తంభాలు<br>మేడారం సమ్మక్క |
| ఏప్రిల్ 27 | జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి |
| మే 2 | కొమురవెల్లి మల్లన్న |
| మే 5 | కురుమూర్తిస్వామి |

## యాదగిరిగుట్టలో హరీశ్‌రావుపై కేసు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): హరీశ్‌రావుతోపాటు బీఆర్‌ఎస్ నేతలపై యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్‌ఎస్ నేతలు మాఢవీధుల్లో సంకల్పం చేయడంపై అభ్యంతరం తెలుపుతూ ఈవో భాస్కర్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నటు సీఐ రమేశ్ తెలిపారు.

### విప్ ఐలయ్యపై కేసు నమోదు చేయాలి: గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగరిగుట్ట, ఆగస్టు 22: హరీశ్‌రావుపై కేసు నమోదు చేసినట్టుగానే ఆలయ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయపరమైన శుద్ధి కార్యక్రమం చేపట్టిన విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతోపాటు మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ మండల నాయకులు కానుగు బాలరాజుగౌడ్, బందారపు భిక్షపతి తదితరులపై కూడా కేసు నమోదు చేయాలని నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.